క్లుప్తంగా

పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి చూపాలి


ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న కోడం రమణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పవర్‌లూమ్ కార్మికులకు శాశ్వత ఉపాధి చూపడంతోపాటు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మకాలనీ పట్టాలకు ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సీపీఐ, పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. టెక్స్‌టైల్ పార్కులో పూర్తిస్థాయిలో పరిశ్రమలను ప్రారంభించాలని, అన్ని రంగాల కార్మికులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మకాలనీలో ఇచ్చిన పట్టాలను ఆన్‌లైన్ చేయాలని కొత్త పట్టాలు ఇవ్వాలన్నారు. అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యం కల్పించాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కోడం రమణ, మూషం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సిరిసిల్లటౌన్: ప్రైవేట్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో శివనగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. 120 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. వార్డు పెద్దలు, ప్రజలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు సన్మానం



గంభీరావుపేట: గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులు, పాలకవర్గం, ఉద్యోగులకు, సిబ్బందికి సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు ఆదివారం ఆత్మీయ సన్మానం చేశారు. త్వరలో పదవికాలం ముగియనున్న సందర్భంగా వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగరాజు, వార్డుసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్లటౌన్: దివ్యాంగుల బస్‌పాస్‌ల జారీకి ఈనెల 29న ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ ఆదివారం తెలిపారు. కొత్త బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్‌లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామని, డిపో పరిధిలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన వారు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్, ఐడీ కార్డుతో పాటు సర్వీస్ చార్జికోసం రూ.50 తీసుకురావాలన్నారు.

నేరెళ్ల బాధితుడు బానయ్యకు ఆపరేషన్


చికిత్స పొందుతున్న బానయ్య

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల బాధితుడు పెంట బానయ్యకు ఆదివారం ఆపరేషన్ జరగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెంట బానయ్య గతంలో నేరెళ్ల ఘటన విషయంలో బాధితుడిగా ఉన్నారు. ఆయనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని తెలిపారు. ప్రస్తుతం బానయ్య కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని కోరారు.

మహిళలకు ముగ్గుల పోటీలు


రాజన్నపేటలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు సర్పంచ్ ముక్క శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లోని విజేతలకు ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందజేయనున్నారు.

సన్మానం

తంగళ్లపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన వెన్నమనేని శ్రీధర్‌రావును కేసీఆర్‌నగర్ బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అమరగొండ రాజు, బీజేవైఎం ఉపాధ్యక్షుడు ప్రసాద్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి నాగుల శ్రీనివాస్, అట్టిపాముల గణేశ్, కటకం మధుసూదన్, సురేశ్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

‘దుమ్ము’ లేస్తోంది


వేములవాడలో ఇటీవల నిర్మించిన మురుగుకాలువ, రోడ్డుపైనే పోసిన మట్టి

- రెండు నెలలక్రితం మురుగుకాలువల నిర్మాణ పనులు ప్రారంభం
- ఇంకాపూర్తికాని పనులు
- వాహనదారులు, పాదచారుల ఇబ్బంది

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో ఇటీవల రహదారుల పక్కన మురుగుకాలువల పనులు ప్రారంభించారు. రెండునెలలు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకుసాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే పట్టణంలో పనులు నత్తనడకన సాగడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువల కోసం మట్టిని తవ్వి రోడ్లపక్కన పోసి వదిలివేశారు. దీంతో పాదచారులకు ఇబ్బందిగా మారింది. వాహనాలు రోడ్డుపై వెళ్తుంటే దుమ్ము ధూళితో ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు, స్థానికులు, దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి నూతనంగా రోడ్డు వేయాలని కోరుతున్నారు.

రూ.5కోట్ల నిధులు

పట్టణంలోని రోడ్లు, మురుగుకాలువల అభివృద్ధి కోసం రూ.5కోట్లు వెచ్చించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా మల్లారం రోడ్డుపనులు, కోరుట్ల బస్టాండ్ నుంచి రోడ్డుపనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం చెక్కపల్లి రోడ్డు తెలంగాణ చౌక్‌నుంచి కోరుట్ల బస్టాండ్ వరకు పనులు పూర్తిచేసి రహదారి నూతనంగా ఏర్పాటు చేయాలి. రాజన్న ఆలయం నుంచి జగిత్యాల బస్టాండ్ వరకు పనులు పూర్తిచేయాల్సి ఉంది. ఈపనులు మహాశివరాత్రి వరకు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

మహాశివరాత్రికి పూర్తయ్యేనా..

మేడారం సమ్మక్క- సారక్క జాతర సందర్భంగా ఇప్పటికే రాజన్న ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. ఆలయంలో వైభవంగా జరిగే మహాశివరాత్రికి అన్ని ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. దీంతో పట్టణంలోని రోడ్లు శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది. అధికారులు ఇప్పటికైనా మహాశివరాత్రి వరకు రోడ్డు పనులు పూర్తిచేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డుపై మట్టిపోశారు



మురుగుకాలువల కోసం మట్టిని తవ్వి రోడ్డుపై పోయడంతో వాహనాలు నడుస్తుంటే దుమ్ము విపరీతంగా లేస్తోంది. దీంతో దుకాణదారులు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. అధికారులు పట్టించుకొని నూతనంగా రోడ్డు వేయాలి.

– గుడూరి వేణు, వేములవాడ

కొత్త రోడ్డు వేయాలి



నిత్యం వాహనాల రాకపోకలతో రహదారిపై దుమ్ము దుకాణంలోకి వస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు త్వరగా నూతన రోడ్డు వేసి ఇబ్బందులు తొలగించాలి.

– దాసు, దుకాణదారుడు, వేములవాడ

మహాశివరాత్రి లోపు పూర్తిచేస్తాం



పట్టణంలో ని మురుగు కాలువలు, రోడ్డు పనులు మహాశివరాత్రిలోపు పూర్తయ్యేలా చూస్తాం. పనులు కూడా జరుగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తిచేసి ఇబ్బందులు తొలగిస్తాం.

– దీకొ శాంతయ్య, ఆర్అండ్‌బీ, వేములవాడ

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరినవారితో కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: మాజీ ఎంపీటీసీ పొన్న బాలకిషన్ గౌడ్, జంగ రాంరెడ్డి, ఆధ్వర్యంలో దుమాల గ్రామస్తులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన వందమందికి ని యోజకవర్గం ఇన్‌చార్జి కే.కే.మహేందర్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సింగారం మాజీ సర్పంచ్ గొల్లపల్లి మల్లేశం తదితరులున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకుడు గౌస్, లింగం గౌడ్ తదితరులున్నారు.

పరామర్శ

ముస్తాబాద్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డిగ్రీ విద్యార్థిని ఆదుకుంటామని కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన గడ్డి సంజయ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా కేకే మహేందర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వపరంగా సంజయ్‌ను ఆదుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి రూ.10వేలు అందజేశారు. అనంతరం ముస్తాబాద్‌లోని ఓ హోటల్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, విజయ్‌రెడ్డి, భాను తదితరులున్నారు.

వాలీబాల్ పోటీలు


వాలీబాల్ ఆడుతున్న సీనియర్ క్రీడాకారులు

సిరిసిల్లటౌన్: రెండేళ్లుగా సీనియర్ క్రీడాకారులు సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్ ఆడుతున్నారు. వీరంతా 40 ఏళ్ల నుంచి 50లోపువారే. వాలీబాల్, వాకర్స్ అసోసియేషన్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, కార్యదర్శి దర్శనాల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

బోయినపల్లి: మండలంలోని జగ్గారావుపల్లిలో సెస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్ ఫార్మర్లను సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ ఆదివారం ప్రారంభించారు. విద్యుత్ లో వోల్టేజీతో రైతులు ఇబ్బందుదు పడుతుండగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ ఏఏఈ జి.ప్రశాంత్, లైన్ ఇన్‌స్పెక్టర్ లచ్చయ్య, అసిస్టెంట్ హెల్పర్ శ్రీకాంత్, సెస్ ప్రతినిధులు మ ల్లయ్య, రవి, రైతులు తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

వీర్నపల్లి(సిరిసిల్ల): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెల్ఫేర్ బోర్డులోని కా ర్మికుల పిల్లలకు ఆస్పత్రుల్లో డెలివరీ, వివాహాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.30వేలను రూ.లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దేవయ్య, నరేందర్, రాజు, రాజెల్లయ్య, శంకర్ తదితులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు



గర్జనపల్లి క్రీడాప్రాంగణం (ఫైల్)



పరికరాలు లేని బావుసింగ్ తండా క్రీడాప్రాంగణం

- బోర్డులకే పరిమితమవుతున్న క్రీడా మైదానాలు
- పరికరాలు లేక క్రీడలకు దూరం
- పట్టించుకోని అధికారులు

వీర్నపల్లి (సిరిసిల్ల): గ్రామీణ యువత క్రీడల్లో రాణించేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెల్లో తెలంగాణ గ్రామీణ క్రీడలను ఏర్పాటు చేసింది. కానీ కొన్ని మైదానాలు బోర్డులకే పరిమితమవుతున్నాయి. మండలంలోని మెజారిటీ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. క్రీడాప్రాంగణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపిస్తున్నారు. కొన్నిచోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఆటలు ఆడేందుకు క్రీడాకారులు ఆసక్తి కనబర్చడం లేదు.

సౌకర్యాలు నిల్..

మండలంలోని పలు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా ఉపకరణాలు ఏర్పాటు చేయలేదు. 17 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. చాలాచోట్ల ఇరుకుగా ఉన్న పాఠశాలల్లో మై దానాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల అటవీ ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేసి సాధన చేసేందుకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. రంగంపేట, గర్జనపల్లి గ్రామ పంచాయతీలో క్రీడలకు అనుకూలంగా స్థలం ఉన్నా పరికరాలు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

క్రీడా మైదానాలు ఉండేదిలా..

- గ్రామానికి దగ్గరలో కనీసం ఎకరం స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి.
- క్రీడామైదానం చుట్టూ మొక్కలు నాటాలి.
- పిచ్చిమొక్కలు తొలగించి మైదానం చదును చేయాలి.
- ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయాలి, లాంగ్‌జంప్ కోసం ఆరు మీటర్ల పొడవు, మూడుమీటర్ల వెడల్పు, 0.5 మీటర్ల లోతులో గుంత తీసి సున్నితమైన ఇసుక నింపాలి. వ్యాయామ బార్‌లు ఏర్పాటు చేయాలి.

పట్టించుకోవడం లేదు



మా ఊరిలో చాలామంది క్రీడాకారులు ఉన్నారు. కానీ గ్రామానికి దూరంలో ఇరుకుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. దీంతో సాధన చేసేందుకు ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. క్రీడా కిట్లను ఇంకా అప్పగించలేదు. అధికారులు తీసుకొని సాధన చేసుకునేందుకు ఏర్పాటు చేయాలి.

– పెద్దవేని ప్రవీణ్ యాదవ్, వీర్నపల్లి

అన్ని గ్రామాల్లో ఏర్పాటు



క్రీడాకారుల్లో ఉత్సాహం కల్పించేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే 17 గ్రామాల్లో ఒక్కో ప్రాంగణానికి రూ.30 వేలు వెచ్చించి ఏర్పాటు చేశాం. ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా కిట్లు అందించాం. కొన్నిచోట్ల స్థల సమస్యతో పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేశాం. అనువైన స్థలం దొరకగానే అక్కడికి మారుస్తాం.

నరేశ్, ఎంపీడీవో వీర్నపల్లి

అర్హులను ఓటరు జాబితాలో చేర్చాలి


ఆవునూర్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో ఆనంద్


ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూదన్

ముస్తాబాద్: ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్ అన్నారు. మండలంలోని గూడెం, ఆవునూర్ గ్రామాల్లో ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా 18 నిండిన యువతీ, యువకులను ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. బీఎల్‌వోలు తప్పనసరిగా వారిని గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. వెంట తహసీల్దార్ గణేశ్, ఆర్ఐశ్యామ్ తదితరులున్నారు.

వేములవాడఅర్బన్: నియోజకవర్గంలో రెండ్రోజులుగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసిందని ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. పలు పోలింగ్‌స్టేషన్లలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలించారు. నియోజకవర్గంలోని 260 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు నిర్వహించామని, కొత్తగా 1151, సవరణలకోసం 406 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. తహసీల్దార్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యే సత్యంతో రెడ్డిసంఘం నాయకులు

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ రెడ్డి సంఘం నాయకులు ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. గ్రామంలో రెడ్డి సంఘం భవన నిర్మాణ మిగులు పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటికి ఏర్పాట్లు



సిరిసిల్లటౌన్: ప్రజల తాగునీటి అవసరాలపై టీం 39 ఫౌండేషన్ ఔదార్యం చాటింది. బీవైనగర్ కార్మికవాడల్లో సొంతఖర్చులతో బోరుబావితో పాటు కరెంటు మోటారును ఏర్పాటు చేసింది. ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పాసికంటి లవన్, వార్డు ప్రముఖులు కొండ ప్రతాప్, ఇజ్జగిరి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రుద్రంగి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ సూచించారు. వాట్సాప్, టెక్ట్స్ మెసేజ్ కానీ అయోధ్య రామాలయానికి సంబంధించిన లైవ్ స్ట్రీమింగ్ లేదా లైవ్ ఫొటోస్‌కు సంబంధించి లింక్ వచ్చే అవకాశముందని, ఓపెన్ చేస్తే ఫోన్ హ్యాక్ అయి అకౌంట్‌లోని డబ్బులు కాజేసే అవకాశం ఉందన్నారు.

నేడు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు


ముస్తాబైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని దేవాలయాలను ఆదివారం శుభ్రంచేసి పూలమాలతో అలంకరించారు. హనుమాన్ భక్తులు, కుల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అయోధ్యలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరగనుండగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠ జరిగే సమయంలో శోభాయాత్ర, ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. అయోధ్యలో జరిగే కార్యక్రమాన్ని వీక్షించే భక్తుల కోసం ఆలయం వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మెగా బంపర్‌డ్రా విజేతలకు బహుమతులు


విజేతకు బుల్లెట్ బండి అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని తిరుమల ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా బంపర్ ప్రైజ్ డ్రాను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తీశారు. విజేతలకు బహుమతులు అందించారు. మెగా బంపర్ ప్రైజ్ రాయల్ ఇన్‌ఫీల్డ్ ఈ.లావణ్య, మొదటి బహుమతి ఫ్రిడ్జి కె.దేవేందర్, రెండో బహుమతి హరీశ్, మూడో బహుమతులు శ్రీనివాస్, జి.రవి గెలుచుకున్నారు. తిరుమల ఎలాక్ట్రానిక్స్ ప్రొప్రైటర్స్ పోకల సుమన్, పోకల సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



ఎల్లారెడ్డిపేట: దోర్కా కుట్టుమిషన్ సెంటర్‌లో మూడునెలల పాటు ఉచిత శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. రియల్ ఇండియా మినిస్ట్రీస్ సంస్థ అధ్యక్షుడు జయకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. దోర్కా కుట్టుమిషన్ జాతీయ అధ్యక్షురాలు సుజాత రాణి, ప్రశాంత్, శ్రావణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

వేములవాడఅర్బన్: పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్రప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలపై వివరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ సంతోష్‌బాబు తదితరులున్నారు.

గుండన్నపల్లిలో..

బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకోసం చేపడుతున్న అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.సర్పంచ్ లక్ష్మి, ఎంపీడీవో కార్యాలయ టైపిస్ట్ వంశీ, ఐసీడీఎస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గరాజేశ్వర తండాలో..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వర తండాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైద్యాధికారి స్రవంతి, సూపర్‌వైజర్ లూత్ మేరీ, స్నేహ నరేందర్, పద్మ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జెండాలు పంపిణీ

రుద్రంగి: అయోధ్యలో సోమవారం రామమందిరంలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం ఇంటింటికీ జెండాలు పంపిణీ చేశారు. ప్రతిఇంటి ముందు దీపాలు వెలిగించాలని, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కీర్తనలు, అన్నదానం ఉంటుందన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండల అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా రేసు శంకర్, ఉపాధ్యక్షుడిగా గడ్డం జితేందర్, ప్రధాన కార్యదర్శిగా మంగురపు అశోక్, కార్యదర్శిగా గాదం రామదాసు, కోశాధికారిగా గుండం శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.